# సంక్షేమ పథకాలే బీఆర్ఎస్‌కు శ్రీరామ రక్ష

- కేసీఆర్ పాలనలో పేదల జీవితాల్లో వెలుగులు
- ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేసిన బానోత్ శంకర్‌నాయక్
- కారు గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలి
- బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి సతీమణి సీతామహాలక్ష్మి ఎన్నికల ప్రచారం



వృద్ధురాలు, మహిళలను ఓటు అభ్యర్థిస్తున్న సీతామహాలక్ష్మి

ఇనుగుర్తి, నవంబర్ 6: రాష్ట్రంలో ప్రజా సంక్షేమం కోసం సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలే బీఆర్ఎస్ పార్టీకి శ్రీరామ రక్ష అని మహబూబాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్ సతీమణి సీతామహాలక్ష్మి అన్నారు. ప్రభుత్వ పథకాల వల్ల పేదల జీవితాల్లో వెలుగులు నిండాయని తెలిపారు. సోమవారం మండల కేంద్రంలో ఆమె ఎన్నిక ప్రచారం నిర్వహించారు. మానుకోట అభివృద్ధి ప్రదాత, బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే శంకర్‌నాయక్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. అనంతరం మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ దేశంలో ఎక్కడాలేని విధంగా అనేక అభివృద్ధి, పథకాలు అమలు చేస్తూ ప్రజల గుండెల్లో సుస్థిరంగా నిలిచిపోయినట్లు తెలిపారు. ప్రతిపక్షాల మాయమాటలు ప్రజలు నమ్మి మోసపోవద్దని, మూడోసారి మహబూబాబాద్ ఎమ్మెల్యేగా శంకర్‌నాయక్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో



కార్యకర్తలకు అన్నం వడ్డిస్తున్న సీతామహాలక్ష్మి

పీఏసీఎస్ చైర్మన్ దీకొండ వెంకన్న, పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ బొబ్బిలి మహేందర్‌రెడ్డి, సర్పంచ్ దార్ల రామ్మూర్తి, ఎంపీటీసీ పింగిలి రజితా శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్సీ గండు సావిత్రమ్మ, గ్రామ అధ్యక్షుడు బేతమల్ల చంద్రయ్య, ప్రధాన కార్యదర్శి గండు నాగన్న, గ్రామ యూత్ అధ్యక్షుడు పెండ్లి మహేందర్, ఉపాధ్యక్షుడు బేతమల్ల మనోజ్, మండల సోషల్ మీడియా ఇన్‌చార్జి దార్ల భాస్కర్, సీనియర్ నాయకులు పప్పుల వెంకన్న, నవనందుల శ్రీను పాల్గొన్నారు.

### బాధిత కుటుంబానికి పరామర్శ

మండల కేంద్రానికి చెందిన దుంపల లచ్చమ్మ(85)అనారోగ్యంతో ఆదివారం రాత్రి మృతి చెందగా బాధిత కుటుంబ సభ్యులను మానుకోట ఎమ్మెల్యే సతీమణి సీతామహాలక్ష్మి పరామర్శించారు. అనంతరం లచ్చమ్మ పార్థివదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు మరో ధైర్యం నింపి ఆర్థిక సాయం అందజేశారు.



కరపత్రాలు అందిస్తూ ఎన్నికల ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

## సీఎం కేసీఆర్‌తోనే రైతుల అభివృద్ధి

కేసముద్రం, నవంబర్ 6: సీఎం కేసీఆర్ ప్రభుత్వం అధికారంలో ఉంటేనే రైతులు మరింత అభివృద్ధి చెందుతారని వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ సంకు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని ఉప్పరపల్లి గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా తెలంగాణలో రైతులు, వ్యవసాయరంగ అభివృద్ధికి పథకాలు ప్రవేశపెట్టినట్లు తెలిపారు. రైతు బంధు, రైతుబీమా, 24 గంటల విద్యుత్ సరఫరా వంటి పథకాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయని తెలిపారు. సాగు నీరు అందించడం, మద్దతు ధర కల్పించడంతో రైతులు సంతోషంగా వ్యవసాయం చేస్తున్నారని తెలిపారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో ఇలాంటి పథకాలు ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. కార్యక్రమంలో ఎల్లబోయిన సారయ్య, మంచాల యాకరాజ్యం, అల్లి బీరయ్య, బండారు గోపినాథ్, మంద సాయిబాబా, దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

## గెస్ట్ లెక్చరర్ల నియామకానికి దరఖాస్తులు

పరకాల/హనుమకొండచౌరస్తా, నవంబర్ 6: పరకాల పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇంగ్లిష్ గెస్ట్ లెక్చరర్ల నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ బి.సంతోష్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. 2023-24వ విద్యా సంవత్సరానికి అభ్యర్థులు ఇంగ్లిష్ సబ్జెక్టులో 55 శాతం (ఎస్సీ, ఎస్టీలు 50 శాతం) మార్కులతో పీజీ ఉత్తీర్ణ సాధించి ఉండాలని సూచించారు. సెట్, నెట్, పీహెచ్‌డీ అభ్యర్థులకు ప్రాధాన్యం ఉంటుందని, ఆసక్తిగల అభ్యర్థులు ఈ నెల 9లోగా విద్యార్హత సర్టిఫికెట్లను కళాశాలలో అందించాలని కోరారు. వివరాలకు 9951535357 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు. అలాగే, హనుమకొండలోని కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో ఖాళీగా ఉన్న అతిథి అధ్యాపకుల పోస్టులకు ఈ నెల 8న ఉదయం 11 గంటలకు ఇంటర్వ్యూ నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ రాజారెడ్డి తెలిపారు. కంప్యూటర్ సైన్స్/అప్లికేషన్- రెండు పోస్టులు ఉన్నాయని, యూజీసీ నిబంధనల ప్రకారం పీజీలో 55 శాతం మార్కులు, నెట్, సెట్, స్లెట్, పీహెచ్‌డీ అర్హత కలిగి, ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఈ నెల 7న సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తు చేసుకోవాలనారు.

## అయ్యప్ప భక్తులకు ఆర్టీసీ అద్దె బస్సులు

హనుమకొండచౌరస్తా/పరకాల, నవంబర్ 6: శబరిమలకు వెళ్లే అయ్యప్ప భక్తులకు ఆర్టీసీ వరంగల్-1 డిపో నుంచి అద్దె ప్రతిపాదికన కొత్త సూపర్ లగ్జరీ బస్సులను ఏర్పాటు చేయనున్నట్లు వరంగల్ రీజినల్ మేనేజర్ జె.శ్రీలత తెలిపారు. ఒక గురుస్వామితోపాటు ఇద్దరు వంట మనుషులు, ఇద్దరు మణికంఠలు, ఒక అటెండర్ ఫ్రీగా ప్రయాణించే అవకాశం కల్పిస్తున్నట్లు పేర్కొన్నా రు. శబరిమలకు బస్సులు బుక్ చేసిన ఔత్సాహిక గురుస్వాములకు రోజుకు రూ. 300 చొప్పున కమీషన్ ఇస్తామని, కొత్త బస్సుల్లో ఆధునిక సదుపాయాలతో ఆడియో, వీడియో సౌకర్యం, సెల్‌ఫోన్ చార్జింగ్ సాకెట్లు ఉన్నట్లు వివరించారు. వివరాలకు వరంగల్-1 డిపో-9866373825, 7382855793 నంబర్లలో సంప్రదించాలని ఆర్ఎం శ్రీలత కోరారు. శబరిమలకు పరకాల నుంచి ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు పరకాల డిపో మేనేజర్ రవిచందర్ తెలిపారు. వివరాలకు 9666919190,738285 2511 సెల్ నంబర్లలో సంప్రదించాలన్నారు.

## కొత్తగూడెం కేయూ ఇంజినీరింగ్ ప్రిన్సిపాల్‌గా జగన్మోహన్‌రాజు



కేయూ వీసీ రమేశ్ నుంచి నియామక ఉత్తర్వులు అందుకుంటున్న జగన్మోహన్‌రాజు

హనుమకొండ చౌరస్తా, నవంబర్ 6: కాకతీయ విశ్వవిద్యాలయ పరిధిలోని కొత్తగూడెం ఇంజినీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్‌గా, ఈఈఈ విభాగ సహాయ ఆచార్యులు డాక్టర్ టీ జగన్మోహన్‌రాజును నియమిస్తూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ టీ శ్రీనివాసరావు ఉత్తర్వులు జారీ చేశారు. జగన్మోహన్‌రాజు 2005 సంవత్సరంలో ఈఈఈ విభాగంలో సహాయ ఆచార్యులుగా ప్రవేశించారు. గతంలో వసతిగృహ సంయుక్త సంచలకుడిగా, వైస్‌ప్రిన్సిపాల్‌గా, ప్రిన్సిపాల్‌గా కూడా పనిచేశారు. ఆయన ప్రస్తుతం ప్రిన్సిపాల్ డాక్టర్ పున్నంచందర్ నుంచి బాధ్యతలు స్వీకరించనున్నారు. ఈ సందర్భంగా పలువురు బోధన, బోధనేతర సిబ్బంది, పరిశోధకులు, విద్యార్థులు జగన్‌మోహన్‌రాజును అభినందించారు.

## కేయూలో కొండచిలువల సంచారం

హనుమకొండ చౌరస్తా, నవంబర్ 6 : కేయూలో కొండచిలువలు సంచరిస్తున్నాయి. కెమిస్ట్రీ డిపార్ట్‌మెంట్ నుంచి ఫార్మసీ డిపార్ట్‌మెంట్ వరకు తిరుగుతుండడంతో ప్రొఫెసర్లు, విద్యార్థులు భయాందోళన చెందుతున్నారు. ఆదివారం రాత్రి 7 గంటల సమయంలో భారీ కొండచిలువ ఫార్మసీ, జియాలజీ విభాగం మధ్య నుంచి వెళ్లగా, గమనించిన వాకర్స్ ప్రొఫెసర్ సమ్మయ్యకు తెలిపారు. ఇటీవల యూనివర్సిటీ ఫస్ట్ గేటు, ఫిజికల్ ఎడ్యుకేషన్ హాస్టల్, హెల్త్ సెంటర్-బయోటెక్నాలజీ, కెమిస్ట్రీ, ఫార్మాస్యుటికల్-కెమిస్ట్రీ, జియాలజీ-ఫార్మసీ అల్యూబిల్డింగ్, లైబ్రరీ-క్యాంటీన్ ఆవరణలో చాలాసార్లు కొండచిలువలు తిరుగుతుండగా చూసినట్లు ప్రొఫెసర్లు, విద్యార్థులు చెబుతున్నారు. యూనివర్సిటీ అధికారులు ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్‌ను సంప్రదించాలని కోరుతున్నారు.

## ఐదుగురిపై కేసు నమోదు

పరకాల, నవంబర్ 6 : ఎన్నికల నిబంధనలను అతిక్రమించి బీఆర్ఎస్ ప్రచార రథంపై దాడి చేసిన ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రమేశ్ నాయక్ తెలిపారు. పరకాల బస్టాండ్ సర్కిల్‌లో కాంగ్రెస్ కార్నర్ మీటింగ్ నిర్వహిస్తుండగా అటుగా వచ్చిన బీఆర్ఎస్ ప్రచార వాహనంపై కాంగ్రెస్ నాయకులు దాడి చేశారు. ఈ ఘటనపై బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు మడికొండ శ్రీను పోలీసులకు ఫిర్యాదు చేయగా, ప్రాథమిక విచారణ అనంతరం పోలీసులు చాడ తిరుపతిరెడ్డి, పర్నం మల్లారెడ్డి, కొయ్యడ శ్రీనివాస్, ఎండీ అలీ, చందుపట్ల రాజిరెడ్డిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

## చికిత్స పొందుతూ తాపీమేస్త్రి మృతి

సంగెం, నవంబర్ 6 : పురుగుల మందు తాగిన చికిత్స పొందుతూ వ్యక్తి మృతిచెందిన ఘటన సోమవారం జరిగింది. కుటుంబసభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని గవిచర్ల గ్రామానికి చెందిన ముడిదేని రాజు(36) తాపీమేస్త్రి పని చేస్తుండేవాడు. అతడు అదే గ్రామానికి చెందిన మమతను 2009లో ప్రేమ వివాహం చేసుకున్నాడు. వీరికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఇరవై రోజుల క్రితం రాజుకు నోటికి ఇన్‌ఫెక్షన్ అయింది. దీంతో ఎంజీఎం దవాఖానలో చికిత్స చేయించారు. అయినప్పటికీ తగ్గకపోవడంతో బాధను తట్టుకోలేక గత నెల 28న పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు ఎంజీఎం దవాఖానకు తరలించగా, చికిత్స పొందుతూ మృతిచెందాడు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై భరత్ తెలిపారు.



శ్రీనివాసరావుకు నియామక ఉత్తర్వులు అందజేస్తున్న కేయూ వీసీ ప్రొఫెసర్ రమేశ్

## కేయూ స్పోర్ట్స్ బోర్డు కార్యదర్శిగా శ్రీనివాసరావు

హనుమకొండ చౌరస్తా, నవంబర్ 6: కాకతీయ విశ్వవిద్యాలయ స్పోర్ట్స్ బోర్డు నూతన కార్యదర్శిగా పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగ ప్రొఫెసర్ పీ శ్రీనివాసరావును నియమిస్తూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ టీ శ్రీనివాసరావు ఉత్తర్వులు జారీ చేశారు. ప్రొఫెసర్ శ్రీనివాసరావు ప్రస్తుత క్రీడా కార్యదర్శిని ప్రొఫెసర్ టీ సవితా జ్యోత్స్న నుంచి బాధ్యతలు స్వీకరించనునారు. శ్రీనివాసరావు గతంలో దివ్యాంగుల సెల్ సంచాలకులుగా, అడ్మిషన్‌ల డైరెక్టరేట్ జాయింట్ డైరెక్టర్‌గా, యూనివర్సిటీ కాలేజీ వైస్‌ప్రిన్సిపాల్‌గా, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగ పాఠ్యప్రణాళిక అధ్యక్షుడిగా, ప్రస్తుతం పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగాధిపతిగా ఉన్నారు. ఈ సందర్భంగా పలువురు బోధన, బోధనేతర సిబ్బంది, పరిశోధకులు, విద్యార్థులు ప్రొఫెసర్ శ్రీనివాసరావును అభినందించారు.

## గణితంలో మాస్టర్స్‌కు ఉచిత శిక్షణ



నాగయ్య

హనుమకొండ చౌరస్తా, నవంబర్ 6: దేశంలోని ప్రతిష్టాత్మకమైన విద్యాసంస్థల్లో మాస్టర్స్ చదివేందుకు సిద్ధమయ్యే విద్యార్థులకు గణితంలో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల గణిత విభాగ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ నాగయ్య తెలిపారు. జాతీయస్థాయిలో ఫిబ్రవరిలో నిర్వహించి ఐఐటీ జామ్(జాయింట్ అడ్మిషన్ ఫర్ మాస్టర్స్) సెంట్రల్ యూనివర్సిటీ ప్రవేశపరీక్షకు ఆన్‌లైన్ ద్వారా గణిత అభ్యర్థులకు రోజు సాయంత్రం 7నుంచి 9 గంటల వరకు తరగతులు ఉంటాయన్నారు. మోడల్ టెస్ట్ సిరీస్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కరోనా నుంచి ప్రతిఏడాది గణిత అభ్యర్థుల కోసం ఉచిత కోచింగ్ నిర్వహిస్తున్నామని, అనేక మంది విద్యార్థులు ఐఐటీ, ఎన్ఐటీ, సెంట్రల్ యూనివర్సిటీలలో పీజీ చేస్తున్నారని, అవకాశాన్ని తెలుగు రాష్ట్రాల్లోని గణిత అభ్యర్థులు ఉపయోగించుకోవాలన్నా రు. వివరాలకు 9701275354 సెల్‌నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

## సాహితీమూర్తులకు సత్కారం

పోచమ్మమైదాన్, నవంబర్ 6: ఓరుగల్లు అక్షరకారుల్లో శ్రేష్ఠులైన నలుగురు కవులను ఎంపిక చేసి, సాహిత్య కృషికి గుర్తింపుగా 'ఓరుగల్లు సాహితీ కీర్తిపతాకలు' స్థానాన్ని నిలబెట్టిన 'సాహితీ బంధు బృందము' సంస్థ సేవలు మరవలేనివని ప్రముఖ కవి, ఆచార్య బన్న అయిలయ్య అన్నారు. సాహితీ బంధు బృందం వరంగల్ ఆధ్వర్యంలో ఓరుగల్లు సామితీ కీర్తి పతాకలు పేరిట నలుగురు కవులను ఘనంగా సత్కరించారు. హనుమకొండ వడ్డేపల్లి రోడ్డులోని పీఆర్ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం రాత్రి జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఇలాంటి సాహిత్య కార్యక్రమాలు ఇంకా నిర్వహించడం అభినందనీయమన్నారు. అనంతరం డాక్టర్ జీవీ రత్నం, రామా చంద్రమౌళి, జీ గిరిజామనోహరబాబు, డాక్టర్ లంకా శివప్రసాద్‌లను ఘనంగా సత్కరించారు. ఆచార్య కోవెల సుప్రసన్నాచార్యను సన్మానం చేశారు.

## సామూహిక అనఘాష్టమి వ్రతాలు

పోచమ్మమైదాన్, నవంబర్ 6: దీపావళి పర్వదినం సందర్భంగా ములుగు రోడ్డులోని శ్రీవరద దత్తక్షేత్రంలో సామూహిక అనఘాష్టమి వ్రతాలను నిర్వహించనున్నట్లు దత్తక్షేత్రం ట్రస్ట్ చైర్మన్ వైవీ వామన్‌రావు తెలిపారు. సోమవారం కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ నెల 10న అవధూత దత్తపీఠం ఉత్తరాధికారి దత్త విజయానంద తీర్థస్వామి ఓరుగల్లులోని ఆశ్రమానికి చేరుకుంటారని, సాయంత్రం స్వాగతసభ ఉంటుందన్నారు.